
# వెన్నెల కుప్పలు

## చొప్పదండి సుధాకర్



'ప్రపంచంలోని ప్రతి కుక్కకు తనదంటూ ఎప్పుడో ఒకరోజు వస్తుంది!'

ప్రస్తుతం నా పరిస్థితి చూస్తోంటే నాకు ఎప్పుడో చదివిన ఈ వాక్యం గుర్తొస్తోంది! కాకపోతే ఏమిటీ? నేనేమిటో నేనే మర్చిపోయి దాదాపు అర్థ శతాబ్దం జీవితాన్ని అనాలోచితంగా గడిపేసిన నాకు ఇప్పుడు ఇష్టాఇష్టాలతో పనేమిటనీ?

స్మశాన వైరాగ్యానికి ముందు ఎదురయే జీవిత వైరాగ్యమంటే ఇదే కాబోలు! ఇంతకు మీకు అసలు విషయం చెప్పనేలేదు కదూ! డాక్టర్‌గారు చెప్పినపుడు నిద్ర నటించి నేను విన్న ఆ వాక్యం.

"ఇంకా ఎంతో కాలం బతకదు! మహా అయితే వారంరోజులు లేదా పదిహేనురోజులు అంతే! ఈ లోగా ఆమెకేదిష్టమో అది కాదనకుండా అందివ్వండి దట్సాల్!" ఎంతో కాజువల్‌గా అనేసి బయటకు వెళ్ళిపోయాడు డాక్టర్.

చుట్టూ ఉన్న దాదాపు ఇరవైమంది బంధుగణం ఒక్కరూ నోరు విప్పలేదు. కనీసం 'ప్చ్' అనికూడా విచారం వ్యక్తం చేయలేదు. నలుగురు కూతుళ్ళు, ముగ్గురు కొడుకులు వాళ్ళ భార్యలు, పిల్లలూ అంతా కలిసి ఓ టూరిస్టు బస్సుకు కూడా సరిపోని బలగం. అంతా నావాళ్ళే! నా రక్తం పంచుకు పుట్టినవాళ్ళే! ఎవరూ పరాయికాదు. మా కాలం భాషలో చెప్పాలంటే కాకి బలగం!

అయితే మాత్రం...! నాకే జబ్బు చేసిందో నాకే తెలియదు. వీళ్ళూ చెప్పరు. 'పరాయివాళ్ళు' కాదుగదా! అందుకే చెప్పరు!

మొన్న ఉదయం పూట కాబోలు మొహం కదుక్కొంటుంటే కళ్ళు తిరిగి పడిపోయాను, అంతే...! మెలకువ వచ్చి చూసేసరికి హాస్పటల్‌లో ఇదిగో ఇట్లా అచేతనంగా పడి ఉన్నాను.

ఇహ మొదలయ్యాయి, బంధువుల రాకపోకలు, పలకరింపులు!

హుఁ... ఎంత త్వరగా జీవిత చరమాంకానికొచ్చేను? ప్రస్తుతం అరవయి మూడో, అరవయి నాలుగో ఉండి ఉంటానేమో? అన్నీ సక్రమంగా ఉండి ఉంటే మరో పదిపదిహేనేళ్ళు ఖచ్చితంగా బతికేదాన్నే! కానీ ఇప్పుడా ఆశ ఏమాత్రంలేదు. ఎందుకంటే చివరకు డాక్టరు కూడా ధృవీకరించేడు కదా! తప్పకుండా పోతానని!!

ఈ భూమ్మీద కొచ్చిన ఎవరయినా ఆఖరుకు చేరాల్సింది మృత్యుదేవత ఒడిలోకేకదా! నేనూ అంతే! ఇందులో పెద్దగా విచారించవలసిందేమిటో నాకయితే అర్థంకాదు. కాకపోతే నా అసలు బాధ ఏమిటంటే ఇన్నాళ్ళుగా, ఇన్నేళ్ళుగా నేనేమిటో నా మనసేమిటో ఒక్కరు కూడా తెలుసుకున్న పాపాన పోలేదు. కనీసం నాకు మద్దతుగా, ఆప్యాయంగా మాట్లాడిన గురుతూ లేదు. చివరాఖరికి నా చావు వార్తయినా నాతో ఏ అరమరికలు లేకుండా చెబితే నా చావేదో నేను నిశ్చింతగా చనిపోయేదాన్నిగా! ఉహుఁ... కుదరదు మొదట్నుంచి భ్రమలో బతికి కలలవెంట పరుగెత్తిన నేను ఆ కలల్లోనే, ఆ భ్రమలతోనే పోవాలన్నది వీళ్ళ అభీష్టం కాబోలు! ఆ మాటయినా స్పష్టంగా ఒప్పుకుంటారా? అబ్బే దానికీ ఒక నయవంచక ముసుగు తగిలించి 'బతికినంత కాలమైనా తృప్తిగా, హాయిగా బతకనీ ఎటూ పోయే ప్రాణమేకదా!' అంటూ నన్నేదో ఉద్ధరిస్తున్నట్టు ఫోజులు పెడతారు.

ఇప్పుడు నాకు కావాల్సింది 'ప్రశాంతత' అని వాళ్ళ నమ్మకం.

ఖచ్చితంగా పోతానని తెలిశాక మిగిలేది ప్రశాంతత కాక మరేమిటి? అదే అసలుసిసలు ప్రశాంతత నిజానికి!

మళ్ళీ ఏదో మత్తు ఆవహిస్తోంది. డాక్టర్ ఇందాక

చేసిన ఇంజక్షన్ తాలూకు మత్తుకావొచ్చు. ఈ జబ్బు రావడం కాదుగానీ నాకో గొప్ప అదృష్టం చిక్కింది. ఎపుడంటే అపుడు కోమాలోకి వెళ్ళిపోవచ్చు లేదా వెళ్ళినట్టు నటించి 'వీళ్ళు' నా చాటుగా మాట్లాడే మాటలన్నీ విని ఆనందించవచ్చు, విచారించవచ్చు. మొత్తానికి నా చుట్టూ ఉన్న నా వాళ్ళకి నామీద ఏ అభిప్రాయం ఉందో స్పష్టంగా తెలుసుకోవచ్చు. గొప్పవరం అందించాడు దేవుడు...! కాదు డాక్టరు దేవుడు!! ఇహ నా ఇష్టాయిష్టాల ప్రస్తావనకు వస్తే పుట్టి బుద్ధెరిగిన తర్వాత ఎవరూ నా ఇష్టానికి ఎపుడూ ప్రాధాన్యత ఇచ్చిన పాపానపోలేదు. చిన్నప్పుడు అమ్మానాన్న ప్రతి విషయానికి 'వొద్దు ఆడపిల్లవి' అనే ఊతపదంతో పెళ్ళయ్యేంతవరకు కనీసం ఒక గౌను కూడా నా ఇష్టానికి తగిన రంగుదికానీ, డిజైనుదికానీ కొనిచ్చిన గుర్తులేదు. చదువు, బాల్యం, స్నేహితులు అన్నీ ప్రతిబంధకాల మధ్యే కొనసాగాయంటే ఎంతటి ఆశ్చర్యమో అంతటి వాస్తవం కూడా!

ఇక పెళ్ళి విషయానికొస్తే పదిహేను కూడా పూర్తిగా నిండకుండానే పెళ్ళి అయిందనిపించారు. అప్పట్లో అదే చాలా 'ముదురు' వయసట. చెప్పగూడదుగానీ నా మొగుడు నా అందానికి పోల్చుకొంటే కాలిగోటికి కూడా సరిపోడంటే భేషుగ్గా ఉంటుందేమో? నేను అతడిని ఎపుడూ ఏ కోశానా కూడా ఇష్టపడిన క్షణం ఇంతవరకు లేదు. ఐతే నేను పెళ్ళికి నోరు మూసుకుని అంగీకారం తెల్పినా మా మేనత్త రామలక్ష్మి మాత్రం నా మనసులో మాట అడగనే అడిగేసింది.

“అంతా కలిసి నందుకి ఇష్టంలేని పెళ్ళి చేస్తున్నారేమిటే?” అంటూ.

“ఏమిటే ఆ మాటలూ...?” మా అమ్మ ఆడబిడ్డని కసురుకొంది.

“లేకపోతే ఏమిటే వొదినా! నందు ఎంత అందగత్తెని! దిదిమి దీపం పెట్టుకోవచ్చు. నాకో కొడుకు లేకగానీ, ఉండి ఉంటే ఎత్తుకుపోయి మరీ పెళ్ళి చేసుకునేదాన్ని” మెటికలు విరిచింది కోపంగా.

“చాల్లే సంబడం! ఆయనే ఉంటే...అన్నట్టుంది. అబ్బాయి వాళ్ళు గొప్ప స్థితిమంతులు. అమ్మాయి అందం చూసి నయాపైసా కట్నం అడక్కుండా చేసుకొంటామన్నారు. ఇంతకన్నా మిక్కిలి మన దరిద్రానికి ఎవడు దొరుకుతాడు. అబ్బాయి కాకిలా ఉంటేనేం? పిల్ల డబ్బులో మునిగి తేలుతుంది. అయినా ఇవాళ కొత్తగా మాట్లాడుతున్నావే! మనమంతా ఈ పెళ్ళిళ్ళు ఇష్టపడే చేసుకొన్నామా ఏమిటీ? మన తల్లిదండ్రులు చూశారు, మనం తల వొంచి తాళి కట్టించుకున్నాం అంతే!”

“మన సంగతి వేరు! ఎట్లా చేసుకొన్నా అదృష్టం బాగుండి మంచిసంబంధాలే దొరికాయి. కానీ ఈకాలం పిల్లలు కదా! ఇమడగలుగుతారా?”

“వాళ్ళే సర్దుకుపోతారు! అయినా పెళ్ళి కూడా ఒక బేరమేనమ్మా! మనం ఏదో గొప్ప ఆశించి కొంత చిన్న మొత్తాన్ని వొదులుకోవడానికి సిద్ధపడతాం. అయినా ఎవర్నో బాగుచేస్తున్నట్టు మొహాలు పెడతాం. అటు వాళ్ళూ అంతే! మనల్ని లాభపరుస్తూ వాళ్ళు నష్టపోతున్నట్టు హంగామా చేస్తారు. వెరసి ఇదో దొంగాటలాంటి బేరం. ఎవరెంత నమ్మబలికినా ఎవరూ మొత్తంగా నష్టపోయే పని ఎంతమాత్రం చేయరు” ఎవరో వస్తున్న అలికిడికి గొంతు తగ్గించి ముగించింది.

రామలక్ష్మి అత్త కూడా మాట్లాడడానికి ఇంకేం లేనట్టు మౌనం వహించింది. నేనయితే మొదట్నుంచీ మాట్లాడడమే తక్కువ! ఇక మౌనం గురించి కొత్తగా చెప్పేదేముంది?

ఆ తర్వాత పెళ్ళయిపోయింది. వెంటవెంటనే పిల్లలు. చూస్తూండగానే ఏళ్ళు గడిచిపోయాయి.

హుఁ... ఎన్నాళ్ళయింది ఈ ప్రస్తావన మర్చిపోయి... ఆ పేరునే మర్చిపోయి దశాబ్దాలు గడిచిపోయాయి. ఇక అటువంటి పేరు వీళ్ళకెలా తెలుస్తుందనీ? ప్రభూ... ప్రభూ... ఎక్కడున్నావు ప్రాణమా! అంతరాంతరాళ్ళో ఇన్నాళ్ళూ అత్యంత బలీయంగా, నిర్దాక్షిణ్యంగా పూడ్చిపెట్టిన శక్తేదో ఒళ్ళు విరుచుకొని బయటపడ్డట్టూ... రెండక్షరాల ముద్దుపేరు నా పెదాల మీదికొచ్చింది.

పిల్లలకు పెళ్ళిళ్ళు మళ్ళీ వాళ్ళకు పిల్లలు. రేపో మాపో వాళ్ళకీ పెళ్ళిళ్ళయిపోతాయి. ఇంతే... ఇదే... జీవితం! ఇందులో నా సుఖంగానీ, ఇష్టాయిష్టాలుగానీ ఏమీలేవు. ఉండబోవు. నేనొక సరుకులు మోసే బండిలాంటిదాన్ని వీళ్ళకి. ఒక్కమాటలో చెప్పాలంటే నిమిత్తమాత్రురాలిని!

మళ్ళీ మత్తులాంటి మగత ఆవహిస్తోంది. డాక్టర్ కాబోలు మళ్ళీ వచ్చాడు. ఏదో చెబుతున్నాడు మా పెద్దోడికి.

‘ఏమీ లాభంలేదు! రోగం అలాంటిది! ఇంకా నయం దీనిమీదే పెరాలిస్స్ రాలేదు! వొచ్చినా ఆశ్చర్యపడాల్సిందేమీ లేదు! ఇపుడు మీరు చేయాల్సిందొకటే, ఆమె కోరుకున్న తినుబండారాలు పెట్టండి. ఇష్టమైన మాటలు మాట్లాడండి! మనసును ఆహ్లాదంగా ఉంచండి. ఇంకా ఎవరయినా ఆమెకు ఇష్టమైన బంధువులు, వ్యక్తులు ఉంటే పిలిపించండి. ఏదో వారం పదిహేను రోజులు కొంచెం అవస్థపడండి” పెద్దోడు కాజువల్‌గా తలూపేడు. అదేమంత గొప్ప రంధిపడాల్సిన విషయం కానట్టు...!

మూడో అమ్మాయయితే నవ్వుతోంది. అదేదో శుభవార్తయినట్టు. “దీనికిష్టమైన వారెవరే? నా కొడుకే కాబోలు” చంకలో ఏడాది బాబుని ముద్దాడి అంది.

“ఆఁ నీ కొడుకే! పొడుచుకొచ్చాడు మొనగాడు! దానికి నా కొడుకంటే ప్రాణం! మొన్నోసారి అమ్మమ్మా నీ గొలుసివ్వవా? అంటే తీసి ఇచ్చేసింది. మూడు తులాల గొలుసు! మళ్ళీ ఇచ్చేశాననుకో, అది పోయాకా వానికేకదా అని...” నర్మగర్భంగా నవ్వింది.

“ఇప్పుడే పంపకాలు అయిపోతున్నాయా? మేమంతా ఏంకావాలి?” కొంచెం ఉడుకుమోత్తనం, కొంచెం పరాచికం కలిపి ఇంకో కూతురు అంది. అంతా గొల్లున నవ్వారు.

‘వీళ్ళ నవ్వులకు కారణమిదన్న మాట!’ నిట్టూర్చాను.

‘నేనట్లా ఆఫీసుదాకా వెళ్ళొస్తాను” చేతిలో సిగరెట్ నలిపి పారేస్తూ బయటకు నడిచాడు రెండోవాడు.

“ఆ సిగరెట్ పీకకీ నాకూ తేడా ఏమిటి? ఏమో? నేనసలు వీళ్ళకి తల్లినేనా? మళ్ళీ ఆలోచనలో పడిపోయాను. నా ఊసు ఎవరికీ పట్టడంలేదు! వచ్చేవాళ్ళు వస్తున్నారు, పోయేవాళ్ళు పోతున్నారు. డాక్టరు గారన్నమాటలు గుర్తొచ్చేయి... నాకిష్టమైన వ్యక్తి ఎవరు?

హుఁ... ఎన్నాళ్ళయింది ఈ ప్రస్తావన మర్చిపోయి... ఆ పేరునే మర్చిపోయి దశాబ్దాలు గడిచిపోయాయి. ఇక అటువంటి పేరు వీళ్ళకెలా



తెలుస్తుందనీ?

ప్రభూ... ప్రభూ... ఎక్కడున్నావు ప్రాణమా! అంతరాంతరాల్లో ఇన్నాళ్ళూ అత్యంత బలీయంగా, నిర్దాక్షిణ్యంగా పూడ్చిపెట్టిన శక్తేదో ఒళ్ళు విరుచుకొని బయటపడ్డట్టూ... రెండక్షరాల ముద్దుపేరు నా పెదాల మీదికొచ్చింది.

ఎప్పటి మాట! తానింకా వోణీలుకూడా వేయని లేలేత వయసప్పటి ముచ్చట. జీవితమంటే దోర మాగిన జాంపండు చెట్టుమీంచి కోసుకు తిన్నంత తేలికనీ, తీయననీ అనుకునే పసితనపు నాటి మాట! వేకువ స్నిగ్ధత్వాన్నీ, వెన్నెలకుప్పల స్వచ్ఛతని కలబోసి రంగరించిన పాటగా కాలం గడిచిపోతున్నప్పటి మాట!

నిలదీస్తే నేను చెప్పలేనుగాని, మనసులో నిస్సందేహంగా, నిస్సంకోచంగా చెప్పగలిగే పేరు, ఆనాడూ ఈనాడూ ఆమాటకొస్తే ఏడేడు జన్మలయినా నాకిష్టమైన పేరు ప్రభాకర్... ఒక్కటే...!

ఆ పేరొక్కటి చాలునాకు! అన్నం, నీళ్ళూ, నిద్ర ఏవీ పట్టేవికావు. అతడంటే ప్రాణం...కాదు అతడే నా ప్రాణం... కులం తెలియదు... శాఖ తెలియదు. వావీ తెలియదు, వరసా తెలియదు. తెలిసిందల్లా ఒకటే అతటి తోడిదే లోకం, అతడే సర్వస్వం!

ప్రభాకర్... ప్రభూ...ప్రభూ...! కలల్లో, కన్నుల్లో అతడే!!

మా ఇంటి పక్కే ఉండేవారు ప్రభాకర్ వాళ్ళు. నేను ఎనిమిదో క్లాసులో ఉంటే తాను తొమ్మిదో పదో చదువుతుండేవాడు. అప్పటికే నిలువెత్తు విగ్రహం. కళ్ళలో అద్భుతమైన వెలుగు. అందానికి మన్మథుడే. అందర్నీ శాసించే నాయకత్వ లక్షణంతో చదువులో సైతం గొప్ప చురుకుదనం ప్రదర్శించేవాడు. కబడ్డీ ఆడితే ఎన్నడూ ఓడిపోయిన దాఖలాలు లేవు. ఎపుడూ పదిమందిని వెంటేసుకొని పెత్తనాలు చేస్తూ బలాదూరుగా తిరిగేవాడు. అతడిలో ఏం చూసి ఆకర్షితురాలయ్యావని నిలదీస్తే వివరంగా చెప్పలేనుగానీ, ఆకర్షితురాలు కాకపోవడానికి ఏం వంక చూపాలో తెలియక తికమకపడ్డానని మాత్రం ఖచ్చితంగా చెప్పగలను.

నిలువెల్లా రాజసం! వెల్లువెత్తే మోహనరూపం!!

అప్పటి తన ఆకర్షణ కేవలం ఆకర్షణ కాదని పెళ్ళయ్యాకా దాదాపు ముప్పయ్యేళ్ళ తర్వాత కూడా ఋజువయింది... చిత్రంగా!

ఔను... చివరిసారి ఆక్సిడెంటల్‌గా ఓ పెళ్ళిలో అతడిని దూరంగా చూసి చప్పున చాటుకు తప్పుకొన్నాను. అదే తేజస్సూ! అదే ఓజస్సూ!!

వయసు తెచ్చిన పెద్దరికంతో ఇనుమడించిన వైభవంతో వెలిగిపోతున్నాడు. ఆనందమో, దుఃఖమో రెండూకాని మరేదయినా అలౌకిక విషాద మోగానీ భరించేశక్తిలేక అతడికంట పడకుండా చప్పున వంటింట్లోకి జారుకొన్నాను. అయినా వసారాలో కనిపిస్తూనే ఉన్నాడు. కళ్ళు చెదిరే అందంతో...! కూచున్న చోటునుండి రెండుగంటలు బయటకు రాలేకపోయాను! అంతే, ఇక కనిపించలేదు. బహుశ వెళ్ళిపోయి ఉంటాడు! ఛ! ఆశ ఎంత చెడ్డది, ఇంకా బహుశ ఏమిటీ వెళ్ళిపోయాడు నిస్సందేహంగా!

ఆ రాత్రి ఎంత ఏడ్చానో తడిసిన నా పైట కొంగుకి తప్ప మూడోకంటికి తెలియదు.

ప్రభుతో నా పరిచయం ఒక సుదీర్ఘమైన సుందర స్వప్నం!

వెన్నెల రోజుల్లో రాత్రివేళల్లో అతడికోసం మిగతా స్నేహితులని అడ్డు పెట్టుకొని ఆడుకొన్న రోజులు నా జీవితంలో సువర్ణ ఘడియలని ఘంటాపథంగా చెప్పుకోవచ్చును. దాగుడుమూతలు, దొంగాపోలీస్ ఆట వెన్నెలకుప్పలు ఎన్నెన్నో ఆటలు! అన్నింట్లోకి నాకు నచ్చిన ఆట వెన్నెల కుప్పలు!

> **"నందూ... ఇటు చూడూ..." ఎంత తీయగా అడుగుతున్నాడు? చూడలేకపోయాను. అతడు రెండు చేతులు నా భుజాలమీదేసి ముఖాముఖంగా తిప్పుకున్నాడు. ఒంట్లో రక్తమంతా కాంతివేగంతో ప్రయాణిస్తోన్న ఒరవడి! అప్పుడపుడే శరీరంలో కొత్తగా తొంగిచూస్తోన్న సౌందర్యకోణాల అలజడి!**



దోసెడు ఇసుక తీసుకొని అందులో వేలడంత పుల్లగుచ్చి ఒకరు కళ్ళు మూయగా వీధివీధంతా అటూఇటూ తిప్పి బోలెడు గందరగోళంలో ముంచేసి ఆ ఇసుక కుప్పని ఓచోట పోయమనడం. ఆ తర్వాత మళ్ళీ అడ్డదిడ్డంగా ఇష్టారాజ్యంగా తిప్పి మొదటి చోటుకు తీసుకొచ్చి కళ్ళు వొదిలేస్తారు. ఆ తర్వాత ఆ ఇసుకకుప్ప ఎక్కడుందో కనుక్కొంటే దొరలు! లేకపోతే మళ్ళీ వారే దొంగ అవుతారు!

వెన్నెల కుప్పలు ఆడమంటే ప్రభు గుర్రుగా చూసేవాడు. అవన్నీ ఆడాళ్ళ ఆటలని గేలి చేసేవాడు. కానీ అస్తమానం తాను ఆట ఆడుతున్నంతసేపు తనవెంటే తిరిగేవాడు. ఆ తతంగం నాకు చాలా ఆసక్తి గొలిపేది. ఒకరోజు ధైర్యం చేసి అడిగేను.

"ఎందుకు నావెంట తిరుగుతావ్! ఆడమంటే చేతకాదుగానీ" ఉడుక్కున్నాను.

"నువ్వంటే నాకిష్టం నందినీ" ఒక్కసారిగా అన్నాడు.

ఆశ్చర్యపోయేను! ఏడాదికాలంగా నా గుండెలో గూడుకట్టుకొన్న అద్భుత వాక్యం అది! ఎట్లా అను వదించుకోగలిగేడు, నేనేం చెప్పకుండానే.

"నందూ... ఇటు చూడూ..." ఎంత తీయగా అడుగుతున్నాడు? చూడలేకపోయాను. అతడు రెండు చేతులు నా భుజాలమీదేసి ముఖాముఖంగా తిప్పుకున్నాడు. ఒంట్లో రక్తమంతా కాంతివేగంతో ప్రయాణిస్తోన్న ఒరవడి! అప్పుడపుడే శరీరంలో కొత్తగా తొంగిచూస్తోన్న సౌందర్యకోణాల అలజడి! కరిగి ముద్దగా రూపాంతరం చెందుతున్నట్టు కలవరం రేపుతోన్న ఒంటి వివశత్వం.

"నీకు నచ్చకపోతే ఫరవాలేదులే!" చప్పున వొదిలేసి దూరంగా వెళ్ళిపోయేడు.

"అదికాదు..." ఎండిపోయిన గొంతులోంచి అనుకున్నమాట రానేలేదు. క్షణాల్లో కనుమరుగయ్యేడు. నా ప్రాణాలు తీసుకుపోతున్న బాలవర్ది రాజకుమారుడిలా...!

ఆ రాత్రి కంటిమీద రెప్పవడలేదు!

మళ్ళీ రెండురోజులకు గానీ నాకెదురవలేదు ప్రభు. వెన్నెలకుప్పల ఆటలో నేను గెలిచి వేరొకరి ఆట దూరంగా చూస్తోంటే నెమ్మదిగా పక్కన చేరాడు. ఒళ్ళు ఇంద్రధనుస్సయి హొయలు పోయింది. త్రయోదశి వెన్నెల! అరుగుమీది క్రీనీడలో అలసటగా కూర్చున్నాను. ఎంతో పరికించి చూస్తేగానీ ఎవరి దృష్టికి అందని ఏకాంత ప్రదేశం!

నా చేయి తన చేతిలోకి తీసుకొన్నాడు. ఎంత హాయి! రక్తమంతా కోడెతాచులా సర్‌సర్‌న అతడి చేతిలోకి జారుకుంటున్న అనుభూతి! "నందినీ..." గట్టిగా హత్తుకున్నాడు. మళ్ళీ విడిపోదామన్నా వీలుకానంత గాఢంగా ఉందా కౌగిలి.

ఏంచేస్తాడు నన్ను. అసలు నేను బతికే ఉన్నానా? ఇది కలా నిజమా? వేనవేల అనుమానాలూ, ఆలోచనలు. ఆనందాలు ముప్పేటగా దాడిచేస్తోంటే పూర్తిగా మూగపోయాను!

"వొక్క ముద్దు ఇవ్వవా..."

ముద్దేనా? ప్రాణాలడిగినా కాదంటానా? ఏ నిర్ణయం తీసుకోకుండానే అతడు నన్నందుకొన్నాడు! అంతటి మనిషిని ఒకేఒక్క బిందువులోకి పొదిగినట్టు మలచుకొని...నన్ను తన గొంతులోకి మింగెయ్యాలని తపన పడిపోతున్నాడు. నేను మొత్తంగా కోర్కె సంద్రంలో కొట్టుకుపోతున్నాను. క్షణాలు... ఒకటీ...రెండూ... వొందా... వొందా యాభయి... జీవితం ఇంత తీయని అనుభవాలు కూడా ఇవ్వగలదా? బతుకులో ఇంతటి గగుర్పాటు... పులకింత ఉన్నాయా... హే భగవాన్... కాదూ ప్రభూ నన్నిట్లాగే చంపేసి అమర లోకాలకు తీసుకొనిపో..."

"నందూ... నందూ... ఎక్కడ చచ్చావే...?" అమ్మ పిలుపుతో వెన్ను మీద నల్లత్రాచు పాకినట్టు ఒళ్ళు చల్లబడిపోయింది.

క్షణంలో స్పృహలోకొచ్చేను. అమ్మ ఇంకా అరుస్తూనే ఉంది. అటూ ఇటూ చూసేసరికి ప్రభు కనిపించలేదు. క్షణాల్లో మాయమయిపోయాడు.

కళ్ళు కనిపించడం, చెవులు వినిపించడం, ఒంటి మీద స్పృహ కలగడం వంటి సాధారణ జీవక్రియలు అన్నీ తిరిగి సక్రమంగా పనిచేయడం ప్రారంభించేసరికి సరిగ్గా నిమిషం పట్టింది.

"అబ్బ ఎందుకరుస్తావే! ఇక్కడే ఎక్కడే ఆడుతూ ఉంటుంది. కాస్త ఓపిక పట్టు! అదే వొచ్చేస్తుంది" నాన్న అమ్మ మీద ప్రతిగా అరుస్తున్నాడు. బతికించాడు! హుష్... గట్టిగా గాలి పీల్చి వొదిలేను?

ఇంకా ప్రభు ఊపిరే పీలుస్తున్న భావన!

నాన్న తిట్లతో అమ్మ కాస్త శాంతించింది. అయిదారు నిముషాల తర్వాత గాలికి కొట్టుకుపోయే కాగితంలా ఇంట్లోకి చేరేను. ఎందుకోగానీ అమ్మ ఏమీ అన్లేదు.

రాత్రి సుఖంగా నిద్రపోయాను! ప్రభుతో పరవశిస్తున్నట్టు కలలుగంటూ!

అదే నా జీవితంలో అత్యంత ప్రీతిపాత్రమైన సంఘటన. ప్రదేశం, రోజూ, వ్యక్తీ... అన్నీ...!

ఆ అనుభవం మళ్ళీ ఎదురవలేదు! ఆ ఆనందం పొందిన కొద్దిరోజులకే నాకు పెళ్ళయింది. తదాదిగా అటువంటి ఆనందంగానీ, కనీసం ఏ ఆనందంగానీ నా జీవితంలో చోటు చేసుకొంది లేదు!

నా ఇష్టం, ఆనందం... ఆహ్లాదం అన్నీ ప్రభుయే!

ప్రభుని తెచ్చివ్వగలరా వీళ్ళు? తెచ్చివ్వగలిగితే అంతకన్నా ఆనందం నాకు మరోటి ఉంటుందా? అసలు ప్రభుని చూసి నన్ను నేను నిభాయించుకోగలనా? నిభాయించుకోక ఏం చేస్తాను? పొంగులు వారే వయసులోనే నోరు మెదపలేదు. ఇపుడేం చేయగలను. కాకపోతే ఓ చిన్న కోరిక. చచ్చిపోయేముందు అతడిని ఒకసారి తనివితీరా చూడాలని, వీలయితే మనసుతీరా మాట్లాడాలనీ, ఇంకా వీలయితే చివరిసారిగా అతడి వొళ్ళో తలవాల్చి దీర్ఘనిద్రలోకి జారుకోవాలనీ... ఎన్ని ఆశలో? రోజులు గడుస్తున్నాయి! ఆశలూ సన్నగిల్లుతున్నాయి!!

** ** **

ఇవాళెందుకోగానీ చాలా నీరసంగా ఉంది! మంచంలో కనీసం కూచుండే ఓపిక కూడా లేదు. ఎవరూ బట్టలు మార్చినట్టు లేదు...! నన్నెవరూ చేత్తో కూడా తాకక నాలుగయిదు రోజులయినట్టుంది!

ఎన్నిరోజులయిందీ ఆసుపత్రిలో చేరీ... వాక్య నిర్మాణం తప్పేమో? ఇంకా నా ఆయుష్షు ఎన్నిరోజులు మిగిలిందో? తెలియదు... కళ్ళు తిరుగుతున్నట్టున్నాయి. ఒక్కరు నలుగురుగా, నలుగురు పదిమందిగా అగుపిస్తున్నారు. "అక్కయ్యా! ఎవరో మన అమ్మ వాళ్ళ ఊరు డాక్టరేనట! గొప్ప ఫిజియో థెరపిస్టట, ఫారిన్ రిటర్న్‌డ్‌ట, ఇవాళే ఈ హాస్పటల్‌లో స్పెషల్ క్యాంపు వేసుకున్నాడట. నేను చూపించుకోవాలి! పేరూ.. ప్రభాకర్... కాబోలు..." రెండో అమ్మాయి మాటలు అస్పష్టంగా..కాదు అత్యంత స్పష్టంగా వినిపించాయి.

"ప్రభాకర్... ప్రభూ... ప్రభాకర్... ఎవరూ?" సంశయంతో ఆశ రెపరెపలాడింది.

"అదేనే... మన మేనత్త రామలక్ష్మమ్మ అస్తమానం చెప్పేదే... అతడే మన అమ్మమ్మ ఇంటి పక్క ఇల్లే..." పెద్దమ్మాయి అంది.

సంశయం తీరిపోయింది! ప్రభాకరే... నా ప్రభాకరే...!!

"ఓస్, ఇంతా చేస్తే మనూరువాడేనా?"

"అదేంటే మనూరయితే మాత్రం డాక్టరు కాకుండా పోతాడా?"

ఇద్దరూ కొద్దిసేపు నవ్వుకొన్నారు, అదేవిషయం మాట్లాడుతూ!

నాగుండె క్షణంసేపు ఆగిపోయినట్టనిపించింది. ప్రభూ... ప్రభు ఇక్కడికొచ్చాడా? ఇదే హాస్పటల్లో ఉన్నాడా? ఎంతటి అదృష్టం, నేను పోతానని దేవుడే చివరిసారిగా నన్ను చూడడానికి పంపించి ఉంటాడు...!

ఏమయితే అదయింది, ఒక్కసారి ప్రభుని రమ్మనమని వీళ్ళకి చెబితే... ఏమయినా అనుకుంటారా? ఛీ తొక్కులాట పాడయిపోనూ. ఈ తొక్కులాటతోనేకదా ఇన్నేళ్ళ జీవితాన్ని సర్వనాశనం చేసుకొన్నాను. ఇకనైనా ధైర్యం చేయక తప్పదు. ప్రభు నాకు మంచి స్నేహితుడు! నేనిట్లా చావుబతుకుల్లో కొట్టుమిట్టాడుతున్నానని చెప్పండి! తప్పక వస్తాడు. అందునా నాఆఖరు కోరిక ఇదేకదా! దయచేసి ఈ ఒక్క కోరికా మన్నించండి! అతడు నా సర్వస్వం!" పెద్దగా అరిచి చెప్పాలనిపించింది.

ఆశ్చర్యం! పెదాలు సహకరించడంలేదు. నాలుక మెలికలు తిరిగిపోతోంది! నిజమా... కలా...?

"అయ్యో! అమ్మ నోరు వొంకర్లు పోతోందే డాక్టర్ని పిలవండి" ఎవరో అరిచేరు. రెండు నిమిషాల్లో డాక్టరు వచ్చాడు! ఎక్కడెక్కడో బయట తిరుగుతోన్న బంధుగణం, సొంత బలగం అంతా చుట్టూ చేరారు.

"మొన్ననే చెప్పానుకదా! పక్షవాతం కూడా రావొచ్చనీ, ఇపుడదే వొచ్చింది. ఇక ఈమె మాట్లాడటం అనుభవం! బతకడం అంతకన్నా అసంభవం! ఐయామ్ సారీ, ఈ రాత్రి గడుస్తుందో లేదో..." నా చేయి వొదిలి బయటకు నడిచాడు డాక్టర్.

అంతా గొల్లుమన్నారు! తెచ్చిపెట్టుకున్న ఏడుపు కావడంవల్ల కాబోలు ఎంతో శ్రావ్యంగా వినిపిస్తోంది. వింటూ ఉండిపోయాను. అంతకన్నా ఏం చేయగలను. ఇన్నాళ్ళూ చేసిందదే! తేడా ఏమిటంటే, అప్పుడు నోరుండేది మాట్లాడేదాన్ని కాదు! ఇప్పుడు మాట్లాడాలనుకొన్నా నోరు లేదు! గట్టిగా మాట్లాడితే 'రేపు' కూడా లేదు!

●

# ఆకలికి ఆహారం వాసన తెలుస్తోంది

శరీరం నిద్ర వశమయినప్పుడు
ప్రాణిని ఈ శ్వాస ఓర్పుగా రక్షిస్తుంది
స్మృతులు ప్రాణం పోసుకుంటున్న చప్పుడుకు
మనస్సు కిటికీ రెక్కలు విప్పుకుంటుంది
సమయ భంగం చేయకుండా
గోడ మీద గడియారం, ముల్లును ముడుచుకుంటుంది
స్పష్టమైన చీకటిలో కలల ఆకారాలు
జన్మిస్తూ, జీవిస్తూ
జీవన కాంక్షల కలలకు మరణం లేదు
ఒకనాటి వైభవ భవనాల గవాక్షాల్లోంచి
సారంగి విషాద రోదనం
గజళ్ళగానం మొగలి పూల పరిమళాల్ని వెదజల్లుతోంది
అలలై గానలహరులైన విషాదానందం
అవశేష అస్థిపంజరాలు భవిష్యత్తులోకి
అబగా చూస్తున్నాయి
ఆకాశం గర్భం నిండా నక్షత్ర నిక్షేపాలు
అనవాళ్ళు లేకుండా రాలిపోతున్నాయి
నదులు నాగరికతకు ప్రాణం తీసుకుంటున్నాయి
చీకటిని దహనం చేసే వెలుగు కళ్ళు
ప్రాణ స్పర్శను పసిగడుతున్నాయి.
శనై: శనై:
ఆకలికి ఆహారం వాసన తెలుస్తోంది
నిశ్శబ్దం చిట్లుతున్న శబ్దం
స్మృతుల ప్రాణంతో ఏదో ఒక పద్యం
రాగయుక్తంగా వినబడుతోంది
మనిషి మనసులో స్మశాన నైరాశ్యాన్ని తుడిచేయాలి.
సహస్రాక్షి పాదాల్ని కరచుకొన్న పంచభూతాలు
పెరట్లో బృందస్వరాల్ని పంచిపెడుతున్నాయి
మహార్ణవ ఘోషలో గాలిపటాన్ని ఎగరేస్తున్నాను

\- డా.ధేనువకొండ శ్రీరామమూర్తి

# ఆణిముత్యాలు

\- ఆలోచన లేకుండా అధ్యయనం చేయడం పరమ దండగ. అధ్యయనం చేయకుండా వూరకే ఆలోచించడం శుద్ధ దండగ.

\- కన్‌ఫ్యూషియస్

\- వివేకులు తమ కాలాన్ని విజ్ఞాన సముపార్జనకు వినియోగిస్తారు. కాని అవివేకులు చెడు అలవాట్లకు, నిద్రపోవడం ద్వారా తమ కాలాన్ని వృథా చేసుకుంటారు.

\- సంస్కృత సామెత